
అన్నదాన కార్యక్రమంలో అర్వింద్‌కుమార్, జానకి సుధాకర్

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం. అర్వింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. యోచన స్వచ్ఛంద సంస్థ చైర్మన్ జానకి సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో పోటీపరీక్షల అభ్యర్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, జయేందర్‌బాబు, యాదగిరిగౌడ్, వెంకట్‌గోవింద్‌రావు, అభిషేక్ కెన్నడీ తదతరులు పాల్గొన్నారు.

నేటి నుంచి న్యాయవాదులకు క్రీడా పోటీలు

చిక్కడపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహాయ సహకార సంఘం రజతోత్సవాల్లో భాగంగా న్యాయవాదులకు క్రీడా పోటీలు ఎల్బీస్టేడియంలో శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నామని సంఘం స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ మణికొండ ప్రవీణ్ శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో తెలిపారు. ఇందులో భాగంగా కబడ్డీ, వాలీబాల్, టేబుల్‌టెన్నిస్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు పందెం, మహిళా న్యాయవాదులకు క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు.



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

దివ్యాంగులకు రూ. 10 వేల పెన్షన్ ఇవ్వాలి

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ. 10 వేల పెన్షన్ ఇవ్వాలని, అన్ని రంగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని రాజకీయ పార్టీలు హామీ ఇవ్వాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి, 4 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా రాజకీయపార్టీలు పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలన్నారు. అన్నిరాష్ట్రాల్లో ఎంపీ కోటా నిధుల కింద 25 కోట్ల రూపాయలను దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించాలన్నారు. దివ్యాంగుల పరిరక్షణ చట్టం(ఆర్.పి.డబ్ల్యూడి) 2016ను అన్ని రాష్ట్రాల్లో పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చిన పార్టీలకే మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో సంస్థ జాతీయ కో-కన్వీనర్లు వి.భారతి, కె.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో కార్పొరేటర్ పాదయాత్ర

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాకారం తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ కె.రవిచారి శుక్రవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. నీటి సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ సూచించారు.


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రవిచారి

విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలను తొలగించాలి

చిక్కడపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభానికి కరెంట్ వైర్లతోపాటు ఇంటర్‌నెట్ వైర్లు, కేబుల్స్ నిండిపోవడంతో చెట్టుకొమ్మలు విరిగిపడి ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బాపూనగర్, చర్చిలేన్, జవహర్‌నగర్, నేతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ వైర్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న ఫోన్‌లు బాధితులకు అప్పగింత

చిక్కడపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న 60 మంది బాధితులకు పోలీసులు శుక్రవారం వాటిని అందజేశారు. బాధితులు పోగొట్టుకున్న ఫోన్‌లను ట్రాక్ చేసి పట్టుకున్న సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ సీతయ్య అభినందించారు.


మాట్లాడుతున్న రైల్వే రీజనల్ మేనేజర్ లోకేష్ విష్ణోయ్

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఉచిత ఈఎంఆర్ సెంటర్

బర్కత్‌పుర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అత్యవసర వైద్య సేవలు అందించడానికి టీఎక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత ఎమర్జెన్సీ రిలీఫ్ సెంటర్ (ఈఎంఆర్) ఏర్పాటు చేశారు. సెంటర్‌ను చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సీకే వెంకటేశ్వర్లు, రైల్వే రీజనల్ మేనేజర్ లోకేష్ విష్ణోయ్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధ, టీఎక్స్ ఆస్పత్రులు చైర్మన్ డాక్టర్ కీర్తికర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైల్వే ప్రయాణికులు అత్యవసర సమయంలో ఎమర్జెన్సీ వైద్య సేవలు పొందవచ్చన్నారు. 24 గంటలు ఈ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైల్వే ప్రయాణికులు ఈ సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ బాలాజీ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధి వేణుగోపాల్, టీఎక్స్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


వీహెచ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కృష్ణగౌడ్ తదితరులు

తలసాని ప్రధాన అనుచరుడు కాంగ్రెస్‌లో చేరిక

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్, దిలీప్, నరేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎంపీ వి. హనుమంతరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణగౌడ్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రధాన అనుచరుడిగా ఉండేవారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, దిడ్డి రాంబాబు, పుల్లా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుడు బీఆర్ఎస్‌లోకి..

ముషీరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌కు చెందిన బీఎస్పీ మైనార్టీ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అబ్రార్ హుస్సేన్ ఆజాద్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే ముఠాగోపాల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయకపోతే చర్యలు

అపార్ట్‌మెంట్లను పరిశీలించిన డీఎంసీ

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌వాసులందరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ముషీరాబాద్ సర్కిల్-15 డీఎంసీ ఖాదర్ మొహినుద్దీన్ సూచించారు. ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం జల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ఏఏ అపార్ట్‌మెంట్లలో ఇంకుడుగుంతలు లేవో ఆరా తీశారు. భవన నిర్మాణాలు చేపడుతున్న వారు జలవనరుల పరిరక్షణకు తమవంతు బాధ్యతగా విధిగా ఇంకుడుగుంతలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు హఫీజ్, అనిల్ ఉన్నారు.


ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలని అపార్ట్‌మెంట్‌వాసులకు సూచిస్తున్న ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ ఖాదర్ మొహినుద్దీన్


నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజ్‌కుమార్

నీటి వినియోగంపై అవగాహన ఉండాలి

అంబర్‌పేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో నీటి వినియోగం, సంరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్. రాజ్‌కుమార్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో నీటి పొదుపు, వాడకంపై శిక్షణలో ఉన్న పోలీసు అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి 2024 సంవత్సరాన్ని పీస్ ఫర్ వాటర్ ఇయర్‌గా ప్రకటించిందన్నారు. నీటి ప్రాముఖ్యత, లభ్యత, వినియోగం తదితర అంశాలపై అభ్యర్థులకు తెలియజేశారు. పీటీసీ ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి మాట్లాడుతూ.. నీటిని వృథా చేయొద్దన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మీకుమారి, డీఎస్పీలు పిచ్చయ్య, విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నదీ జలాలను పరిరక్షించుకోవాలి

బర్కత్‌పుర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నదీ జలాలను పరిరక్షించుకున్నప్పుడే నీటి ఎద్దడిని నివారించవచ్చని పలువురు వక్తలు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జీవనది ఫౌండేషన్ ఆధ్వర్యంలో జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే ఫౌండర్ బెల్లం మాధవి పలు సంస్థల ప్రతినిధులు క్రాంతి కృష్ణ, ఆరేపల్లి రాజేందర్, లక్ష్మణ్, రేలంగి నాగశ్రీ, మధు, కవిత, లక్ష్మీదుర్గ, అన్నపూర్ణ తదితరులు మాట్లాడారు. నదులను కాపాడుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు.

అవగాహన ర్యాలీ

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జల వనరులను కాపాడుకోవాలని బాగ్‌లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కుమారస్వామి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడకపోతే నీటి యుద్ధాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు.



అవగాహన ర్యాలీలో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు

భవిష్యత్‌లో తీవ్రంగా నీటి కొరత

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో తీవ్రంగా నీటికొరత ఏర్పడబోతున్నదని, నీటి కోసం దేశాల మధ్య యుద్ధాలు జరిగే అవకాశం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. సదస్సుకు ఐఐసీటీ రిటైర్డ్ శాస్త్రవేత్త కలపాల బాబురావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ముంబాయి ఐఐటీ శాస్త్రవేత్త సాగర్ దార, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకురాలు సరస్వతి, పర్యావరణవేత్త దొంతి నరసింహారెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. తాగునీటి కోసం జరిగే యుద్ధాలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి సమస్యను ప్రపంచ దేశాల సమస్యగా చూడాలన్నారు. ఫార్మారంగం వల్ల రాష్ట్రంలో తీవ్రంగా నీటి కొరత ఏర్పడడమే కాకుండా నీటి కాలుష్యం పెరుగుతుందన్నారు. నీటి సమస్యపై అసెంబ్లీ, పార్లమెంట్‌లో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి సుమారు 17 ఇథనాల్ కంపెనీలు వస్తున్నాయని, ఈ కంపెనీలు ఎక్కువ మొత్తంలో నీటి వనరులను ఉపయోగించుకోవడం ద్వారా తాగునీరు, సాగునీరు కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు.

ప్రజలతో చర్చించకుండా, ప్రజాభిప్రాయం సేకరణ చేయకుండా ఇథనాల్ పాలసీ తీసుకురావడం ప్రజాస్వామ్య వ్యతిరేకమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇథనాల్ పాలసీని నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త సాగర్ ధార

కవులు ప్రజలను చైతన్యం చేయాలి

● ఆచార్య కొలకలూరి ఇనాక్

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కవులు తమ కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యం చేయాలని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, విమలా సాహితీ సమితి సంయుక్తాధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన డాక్టర్ వీడీ రాజగోపాల్ రాసిన 'అక్షరాలు అవే భావాలు ఎన్నో' కవితా సంపుటి పై ప్రముఖ కవులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ జెల్లి విద్యాధర్, రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, పి.శ్రీనివాస్‌గౌడ్, దామోదరాచారి తదితరులు ప్రసంగించారు. వీడీ రాజగోపాల్ సామాజిక ప్రయోజనం కోసం కవిత్వం రాశారని వారు కొనియాడారు. వస్తు వైవిధ్యం, శిల్ప సోయగంతో కవితలు రాశారని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో కవులు తమ కవితలు వినిపించారు. 30 మంది కవులను నిర్వాహకులు సత్కరించారు.


కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్

ఖాళీగా ఉన్న గ్రూప్ పోస్టులన్నింటికీ నోటిఫికేషన్ జారీ చేయాలి : ఆర్. కృష్ణయ్య


మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న గ్రూప్-1, 2, 3, 4 సర్వీస్ పోస్టులన్నింటికీ, 25 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, బీసీ మహిళా వేదిక అధ్యక్షురాలు కరుణశ్రీ ఆధ్వర్యంలో నిరుద్యోగుల సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. గ్రూప్-1 పోస్టులు 1600 ఖాళీగా ఉంటే కేవలం 503 పోస్టులకు, గ్రూప్-2 పోస్టులు 2200 ఖాళీగా ఉంటే 783, గ్రూప్ - 3లో 3 వేల పోస్టులు ఖాళీగా ఉంటే 1383 పోస్టులకు, గ్రూప్ - 4లో 25వేలకు పైగా ఖాళీలు ఉంటే కేవలం 8,500 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నిరుద్యోగజేఏసీచైర్మన్ నీలవెంకటేష్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ తమపోరాటం ఆగదన్నారు. సదస్సులో బీసీ సంక్షేమ సంఘం నాయకులు జిల్లపల్లి అంజి, రాజేందర్, నందగోపాల్, వేములరామకృష్ణ, ఉదయ్, టి.రాజ్‌కుమార్, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిపాటు రాజ్యాంగ పరిరక్షణయాత్ర

బర్కత్‌పుర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 14వ తేదీ వరకు ఏడాది పాటు రాజ్యాంగ పరిరక్షణయాత్ర నిర్వహిస్తున్నామని విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షుడు వస్తార్జీ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని, ఈ సందర్భంగా ప్రజలను చైతన్యవంతం చేయడానికి సభలు, సమావేశాలు, సదస్సులు, చర్చాగోష్ఠులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మూలవాసులకు రక్షణ కల్పించాలని పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాన్షీరామ్ జయంతి నుంచి అంబేడ్కర్ జయంతి వరకు మూలవాసుల మాతాపితా మహాల మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర విజయవంతం కావడానికి విశ్వజన కళామండలి, ఆది జాతి పరిరక్షణ సమితి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా దేవేందర్, మేడి శ్రీనివాస్, ఎడెల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గణేష్, సంయుక్త కార్యదర్శులుగా రాజ్‌కుమార్, మురళీకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.శ్రీనివాస్, ఉమెన్ విభాగం ప్రతినిధులుగా శాంత, యాదమ్మ, కోశాధికారిగా మహేందర్, సలహాదారులుగా ఎం.యాదయ్య, కార్యవర్గ సభ్యులుగా నరేష్, వినయ్, రాంజీవన్ తదితరులు ఎంపికైనట్లు తెలిపారు.


యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాస్టార్జీ తదితరులు


జ్ఞానసభల ఆహ్వానపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యమహాసభ ప్రతినిధులు

25 నుంచి సనాతన వేదాంత జ్ఞాన సభలు

బర్కత్‌పుర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత, రామాయణం, మహాభారతానికి ఉన్న విశిష్టతను అందరికీ తెలియజేయడానికి ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు నగరంలో 98వ సనాతన వేదాంత జ్ఞానసభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సభలకు దేశం నలుమూలల నుంచి స్వామీజీలు, ఆధ్యాత్మికవేత్తలు హాజరవుతున్నారని వారు చెప్పారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మహాసభల ఆహ్వానపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యాసపీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామీజీ, అసంఘానందగిరి స్వామిజీ, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఎస్. లక్ష్మణ్‌గుప్తా, కన్వీనర్ కాశెట్టి పాండుగుప్తా, మీడియా కమిటీ చైర్మన్ డి. ఆనంద్‌గుప్తా, కో-ఆర్డినేటర్ కె. వెంకటేష్ మాట్లాడారు. బాలాపూర్ ఎస్‌పీఆర్ కన్వెన్షన్‌లో జ్ఞానసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

రైళ్ల నిర్వహణలో భద్రతా నియమాలను పాటించాలి

సికింద్రాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైళ్ల నిర్వహణలో భద్రతా నియమాలను అధికారులు, సిబ్బంది కచ్చితంగా పాటించాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సూచించారు. జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రత, సమయపాలన, ట్రాఫిక్ పనుల పురోగతిపై శుక్రవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు, గార్డులు తదితరులతోపాటు భద్రతా సిబ్బంది తరచూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జోన్‌లో పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక పరికరాలు, తదితర వస్తువుల లభ్యతను జీఎం సమీక్షించారు. అనూహ్య, అత్యవసర సమయంలో సరిపడా నిల్వలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.

రోడ్డు ప్రయాణికుల భద్రత కోసం నాన్ ఇంటర్ లాకింగ్ లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద నాయిస్ లాగర్ సదుపాయాలు కల్పించవలసిన ఆవశ్యతను ఆయన గుర్తుచేశారు. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయపాలనపై చర్చిస్తూ ట్రాక్ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకుని, సమయ పాలనను మెరుగుపరచుకోవాలని అధికారులకు సూచించారు. సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ చేయడానికి అదనపు లూప్ లైన్ల ఏర్పాటు, హాల్టు స్టేషన్లను క్రాసింగ్ స్టేషన్లుగా మార్చడం, పొడవైన లూప్‌లైన్ల ఏర్పాటు అంశాలను సమీక్షించారు. రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ధనుంజయులు తదితర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్

బీజేపీ నల్లకుంట డివిజన్ కన్వీనర్‌గా నర్సింగ్‌రావు



నల్లకుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నల్లకుంట డివిజన్ కన్వీనర్‌గా కేబీ నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి జైలు శిక్ష

బర్కత్‌పుర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. కాచిగూడ, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 16మందిపై కేసు నమోదు చేశారు. వారిని బుధ, శుక్రవారం నాంపల్లి 7 ఎంఎం కోర్టులో హాజరుపర్చారు. ముగ్గురికి 2 రోజులు, 12 మందికి 4 రోజులు, ఒకరికి 22 రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఐఎఫ్‌టీయూ నేత కిరణ్ మృతికి పలువురి సంతాపం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆటోమోటారు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ)రాష్ట్ర నాయకుడు వి.కిరణ్ అంత్యక్రియలు శుక్రవారం దమ్మాయిగూడ శ్మశానవాటికలో జరిగాయి.

కిరణ్ మృతికి ఏఐటీయూసీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఐఎన్‌టీయూసీ నాయకుడు బోస్, బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, తెలంగాణ ఆటో సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి దయానంద్ సంతాపం తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అంబర్‌పేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ రఘు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడిగా సదానందం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఆకుల సదానందం(వరంగల్) ఎన్నికయ్యారు. సమాఖ్యకు డాక్టర్ కె.వి.రమణాచారి(రిటైర్డ్ ఐఏఎస్) గౌరవ సలహాదారుగా వ్యవహరిస్తున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచంద్రరావు తెలిపారు.

రవీంద్రభారతిలో జరిగిన సమాఖ్య సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సదానందం, ప్రధాన కార్యదర్శిగా సాదుశ్యామ్‌ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మారంరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వరకవుల దుర్వాసరాజు, కోశాధికారిగా నామ సూర్యవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. సమావేశంలో పౌరాణిక, సాంఘిక నాటకాల పరిరక్షణ, నాటక సంస్థలకు ప్రభుత్వం తోడ్పాటు, కళాకారుల సమస్యలపై చర్చించినట్లు రాంచందర్‌రావు తెలిపారు.


మహిళా దినోత్సవంలో మహిళలు

మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారత సాధ్యం

బర్కత్‌పుర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారత సాధ్యమవుతుందని గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ చాప్టర్ అధ్యక్షుడు పోతుల మన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఫ్యాషన్ షో, క్రీడా, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చందురెడ్డి, కృష్ణ కడారి, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి శ్రీకర్, సాంస్కృతిక ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రావు పాల్గొన్నారు.